క్లుప్తంగా

కేజీబీవీలో ఉద్యోగాలకు దరఖాస్తులు

దొనకొండ: స్థానిక కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాలలో కేటగిరి–2లో హెడ్‌కుక్–14, అసిస్టెంట్ కుక్కు–14, కేటగిరి–3లో హెడ్‌కుక్–12, అసిస్టెంట్ కుక్కు–27 మంది మహిళలు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు మండల విద్యాధికారి–2 షేక్ అమీర్‌బాషా తెలిపారు. దరఖాస్తులను నమోదు చేసుకుని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం



వర్షానికి ఉరుస్తున్న ఆస్పత్రి లోపలి భాగం

కురిచేడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆపరేషన్ అవసరమైంది. 2014–19 కాలం మధ్యలో టీడీపీ ప్రభుత్వం ఈ భవనాన్ని నిర్మించింది. అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు ఆస్పత్రిని ప్రారంభించారు. పట్టుమని పది సంవత్సరాలు కూడా నిండని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం చిన్నపాటి వర్షానికి కూడా కురుస్తోంది. శ్లాబులోని విద్యుత్ పైపుల్లో నీరు చేరుతోంది. తద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగితే పెద్ద ప్రమాదం సంభవిస్తుందని సిబ్బంది, రోగులు భయపడుతున్నారు. నాణ్యతకు తిలోదకాలు వదిలి కేవలం ధనార్జనే లక్ష్యంగా ఆస్పత్రి నిర్మించారనేందుకు ఈ లీకులే నిదర్శనం. ఆనాటి కాంట్రాక్టర్, ఇంజినీర్లపై చర్యలు తీసుకుని, ఆరోగ్య కేంద్రంలో కురుస్తున్న వర్షపు నీటిని నిలుపుదల చేసేందుకు అనుభవం కలిగిన ఇంజినీర్ సలహాలతో ఆపరేషన్ చేయాల్సి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు కోటయ్య మృతి



కోటయ్య (ఫైల్)

త్రిపురాంతకం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, త్రిపురాంతకేశ్వర స్వామి ట్రస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్ భీమిశెట్టి కోటయ్య మృతి చెందారు. మండలంలోని కేశినేనిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన కోటయ్య కొద్ది రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయన వైఎస్సార్ సీపీలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఈయన మృతికి మాజీ ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ పద్మజ మల్లికార్జున్, మండల పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, కో కన్వీనర్ చల్లా యల్లారెడ్డి, సంతాపం వ్యక్తం చేశారు.

క్రీడాకారునికి రూ.15 వేల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న డాక్టర్ ప్రణీత్, నాయక్ తదితరులు

మార్కాపురం: జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన క్రీడాకారునికి మార్కాపురం పట్టణంలో పలువురు ఆర్థిక సాయం అందించారు. పేదింటి క్రీడాకారుడు సీహెచ్ ఆదినారాయణకు తమవంతు సాయంగా సిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సాయిప్రణీత్, జిల్లా అరో అదనపు న్యాయస్థానం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.బాలునాయక్, సబ్ డీఎఫ్‌ఓ వేణు, కేతగుడిపి హెచ్‌ఎం జ్యోతి తదితరులు రూ.15 వేల ఆర్థికసాయాన్ని అందించారు. అథ్లెటిక్స్‌లో రాణించాలని ఆకాంక్షించారు.

లోతట్టు పొలాల్లో వర్షం నీరు

కొనకనమిట్ల: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి భూములు పదునెక్కడంతో పాటు లోతట్టు పొలాల్లో నీరు చేరింది. ఇటీవల రబీ సీజన్‌లో సాగు చేసిన మినుము, అలసంద పైర్లకు ఈ వర్షం ఉపయోగకరమే అయినప్పటికీ లోతట్టు పొలాల్లో నీరు నిల్వ చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

మండుతున్న కూరగాయల ధరలు

- సామాన్యులకు అందనంత ఎత్తులో రేట్లు
- మాంసం, చేపల ధరలకు సైతం రెక్కలు



పెద్దదోర్నాల: మార్కెట్‌లో కూరగాయల ధరలు మంట పుట్టిస్తున్నాయి. ధరలు అమాంతం పెరగటంతో కొనేందుకు సామాన్యులు బెదిరిపోతున్నారు. మార్కెట్‌కు 500 రూపాయలు తీసుకెళ్తే నాలుగు రకాల కూరగాయలు తెచ్చే పరిస్థితి కనిపించడం లేదు. నెల రోజులుగా ధరలు పెరుగుతూనే ఉన్నాయి. నేడు సామాన్యులకు అందనంత ఎత్తుకు ధరలు పెరిగాయి. నిత్యావసరాలతో పాటు కూరగాయల ధరలు నింగినంటడంతో పేద, మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు చికెన్, మటన్, చేపల ధరలు సైతం పెరగటంతో మాంసాహారులు వీటిని తినటం తగ్గించేస్తున్నారు. కిలో చికెన్ రూ.250 పలుకుతుండగా మటన్ ధర రూ.1000 వరకు పలుకుతోంది. చేపల ధరలు చెప్పనక్కర లేదు.

అకాల వర్షాలు..కోతుల బెడద!

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్దారవీడు మండలంలో సాధారణంగా కూరగాయల పంటలు అధికంగా పండుతాయి. అయితే అకాల వర్షాల కారణంగా మొక్కలు కుళ్లిపోవడంతో ప్రస్తుతం దిగుబడులు ఆశాజనకంగా లేవు. కొన్నిచోట్ల కోతులు పంటను నాశనం చేస్తుండటంతో కొంత మంది కూరగాయల సాగుపై దృష్టి సారించటం లేదు. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు కూరగాయలు కొనుగోలు చేసి తీసుకురావటం, స్థానిక ఉత్పత్తులు చాలక పోవడంతో కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. కొత్తిమీర కూడా కొనలేక పోతున్నాం. కూరగాయలు కొన్నప్పుడు కొద్దిగా కొత్తిమీర, కరివేపాకు అడగటం, ఇవ్వడం పరిపాటి. ప్రస్తుతం కొత్తి మీర చిన్న కట్ట 20 రూపాయలు, పెద్దది 40 రూపాయల వరకు పెట్టి కొనాల్సి వస్తోంది. కరివేపాకు కావాలంటే 10 రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అల్లం కేజీ 100 రూపాయలు, మునక్కాడ ఒకటి 15 నుంచి 20 రూపాయల వరకు పలుకుతోంది. నిమ్మకాయలు అయితే చిన్న కాయ సైతం 5 రూపాయలు పలుకుతుండటం గమనార్హం.

కార్తీక మాసం ముగిసే వరకూ ఇంతే..

కార్తీక మాసం నెల రోజుల పాటు అత్యధికంగా కూరగాయల వినియోగం ఉంటుంది. అప్పుడు కూడా భారీగా అన్న సమారాధనలు ఉంటాయి. అలాగే అయ్యప్ప, శివ మాల ధారణ దీక్షలు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో ధరల భారం కార్తీక మాసం చివరి వరకు కొనసాగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు దీనిపై దృష్టి సారించి కూరగాయల సరఫరా పెరిగి ధరలు తగ్గుముఖం పట్టేలా చర్యలు తీసుకుంటే ధరలు అనుకూలంగా ఉంటాయని ప్రజలు కోరుకుంటున్నారు.

కూరగాయల ధరలు (కిలో ఒక్కింటికి)

కూరగాయలు	సెప్టెంబర్	అక్టోబర్
మునగ	80	130
వంకాయ	30	50
పచ్చిమిర్చి	60	60
బెండ	30	50
దొండ	30	40
టమాట	50	80
క్యారెట్	40	60
బీట్‌రూట్	50	60
చేమదుంప	50	80

మండలాభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వసంతరావు నాయక్

పుల్లలచెరువు: ప్రతి ఒక్కరూ మండలాభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో వసంతరావు నాయక్ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెంకటయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి మండలస్థాయి అధికారులు హాజరు కావాలన్నారు. కింది స్థాయి ఉద్యోగులను పంపొద్దని సూచించారు. తగు సమాచారంతో అధికారులు మాత్రమే హాజరు కావాలన్నారు. ఈ నెల 18వ తేదీన పల్లె పండగ కార్యక్రమం నిర్వహించనున్నామని, దీంతో గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీల పనులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈవోఆర్డీ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున పంచాయతీల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ శాఖ ఏఈ కిశోర్ మాట్లాడుతూ గ్రామాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవో నిర్మలాదేవి మాట్లాడుతూ పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నందున రైతులు ఆ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు వైద్యాధికారి నాగుల్‌మీరా, ఏపీఎం వెంకటయ్య, కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పత్తి, మిరప రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

దొనకొండ: గ్రామాల్లోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి, మిరప పంటలపై జాగ్రత్తలు తీసుకుని అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని, పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. వర్షాలతో వరిలో పాము పొడ తెగులు ఉధృతి ఎక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు ప్రోఫికోనజిల్ ఒక మిల్లీ లీటర్ లేక వాలిడామైసిన్ 2 మిల్లీ లీటర్లు తగు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. మిరప పంటలో ఉరక ఎక్కిన పొలాల్లో మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటర్ నీటికి 10 గ్రాముల యూరియా, 10 గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. మొక్కలు వడబడి కల్లలు వాల్చితే లీటర్ నీటికి 5 గ్రా మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణం పిచికారీ చేసి నివారించుకోవాలన్నారు. వేరుకు కుళ్లు ఆశించిన పొలాల్లో ఆక్సిక్లోరైడ్ 30 గ్రాములు లేదా కార్బండైజన్ 10 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదట్లో పోయాలన్నారు. పత్తి పంటలో వర్షపు నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు పొలం నుంచి నీరు తీసి వేయాలని, మొన్నటి వరకు వర్షాలు లేక పైరు బెట్టకు గురైనట్లు చెప్పారు. దీంతో ఎదుగుదల తక్కువ ఉండటంతో ఎకరాకు 20 కిలోల యూరియాను పిచికారీ చేయాలన్నారు. వర్షాలకు పత్తిలో కలుపు వచ్చే అవకాశం ఉందని, ఎకరాకు జలాఫాస్ 400 మిల్లీ లీటర్లు, పైరితాయోబాక్ సోడియం 200 మిలీ పిచికారీ చేయాలన్నారు. పత్తి కాయ దశలో కాయ కుళ్లు రావడానికి అవకాశం ఉందని, దీని నివారణకు కాపర్ క్లోరైడ్ 30 గ్రా మరియు 2 గ్రా ప్లానోమైసిన్ 10 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసి తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవాలని వ్యవసాయాధికారి సూచన, సలహాలు అందజేశారు.

> **తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందండి**
>
> 
>
> రైతులు సాగు చేసిన పంటలకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందాలి. వర్షాలు దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలి. పంటలకు చీడ పీడ పురుగులు సోకితే వ్యవసాయ శాఖను సంప్రదించాలి. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది అన్ని వేళల్లో అందుబాటులో ఉంటారు. రైతులు సమస్యలను వ్యవసాయ శాఖకు తెలియజేసి పరిష్కరించుకోవాలి.
>
> – ఎస్.లక్ష్మీనారాయణ, ఏఓ

పొంగి పొర్లిన వాగులు..వంకలు!



ముండ్లమూరు మండలం మారెళ్ల వద్ద వాగును పరిశీలిస్తున్న ఎస్సై నాగరాజు



పోలవరం సచివాలయంలో సామగ్రి తడవకుండా కప్పిన పట్ట

- రాకపోకలకు అంతరాయం
- ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం
- బురదమయంగా మారిన రోడ్లు

దర్శి: జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొర్లి పొంగుతున్నాయి. అందులో భాగంగా దర్శి నియోజకవర్గంలో దోర్నపువాగు, చిలకలేరు, గుండ్లకమ్మ వాగులకు కూడా భారీగా నీరు చేరుకుని రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలు సచివాలయాలు, పాఠశాలల్లోకి నీరు చేరి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముండ్లమూరు మండలం పోలవరం పాత పంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన సచివాలయం భవనంలో లీకేజీలు ఏర్పడి వర్షానికి ఉరుస్తోంది. గ్రామాల్లో రోడ్లు బురదమయమయ్యాయి. పొలాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా బురదమయమయ్యాయి. దర్శి పట్టణంలో రోడ్లపై నడిచి వెళ్లే వాళ్ల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. వర్షానికి వాహనాల రాకపోకల సమయంలో నీరు చింది పైన పడటం వంటి తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. ముండ్లమూరు మండలం మారెళ్ల సమీపంలో గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎస్సై నాగరాజు వాగు వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి రాక పోకలు సాగించే వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. వాహనాలు ముందుకు వెళ్లక పోవడంతో గడ్డి మోపులు వంటి బరువైన వస్తువులు ట్రాక్టర్‌పై వేసుకుని వాగు దాటించుకుంటున్నారు. తాళ్లూరు మండలం బెల్లంకొండవారిపాలెం వద్ద దోర్నపు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ముండ్లమూరు–తాళ్లూరు మధ్య చిలకలేరు వాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వర్షం మెట్ట పంటలకు ఊరటనిచ్చిందని రైతులు చెప్తున్నారు. వర్షాలకు వాగులు వంకలు నిండితే బోర్లులోకి నీరు వచ్చి బోర్లు రీచార్జీ అవుతాయని రైతులు ఆశతో ఉన్నారు.



దోర్నపు వాగులో నిలిచిన వాహనాలు



వర్షానికి ఉరుస్తున్న మరో సచివాలయ భవనం

మున్సిపల్ డీఈగా శ్రీనివాసరావు



మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ డీఈగా ఎ.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు డివిజన్ ఏపీ టిడ్కో డీఈగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై మార్కాపురంలో నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సుబానీ మాచర్లకు బదిలీ అయ్యారు.

వ్యవసాయ శాఖ సేవలు వినియోగించుకోవాలి



తాళ్లూరు: మాట్లాడుతున్న ఏఓ ప్రసాదరావు



దర్శిలో మాట్లాడుతున్న ఏఓ బాలకృష్ణనాయక్



కురిచేడు: పంటలను పరిశీలిస్తున్న ఏఓ మధుబాబు

దర్శి: రైతులు వ్యవసాయ శాఖ సేవలు వినియోగించుకోవాలని ఏఓ బాలకృష్ణ నాయక్ సూచించారు. మండలంలోని బసిరెడ్డిపల్లె, చందలూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ పంటలపై ఆశించే చీడ పీడలు, తెగుళ్ల గురించి క్షేత్ర సందర్శనతో తెలిపారు. రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. అప్పుడే ప్రతికూల పరిస్థితుల్లో పంటనష్టం వాటిల్లినప్పుడు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని చెప్పారు. వర్షాలకు రైతులు తమ పొలాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని కోరారు. పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ బసవయ్య, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.


పెద్దదోర్నాల: మండల పరిధిలోని యడవల్లి, గంటవానిపల్లెల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్‌నాయక్ పాల్గొని ఆయా గ్రామాల్లో సాగు చేసిన పత్తి, మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయోగాత్మకంగా వేప గింజల కషాయం చేశారు.

తాళ్లూరు (దర్శి): కందిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ ప్రసాదరావు సూచించారు. మండలంలోని శివరాంపురం, మాధవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ కందిలో మారుకా మచ్చల పురుగు నివారణకు ఆకు చుట్టూ పురుగు నివారణకు క్వినాల్‌ఫాస్ 2 మిలీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పశుసంవర్థక అసిస్టెంట్ ఎం.ఆంజనేయులు, వీఏఏలు రాజశేఖరరెడ్డి, సుధీర్, అనూష, రైతులు లక్ష్మీనారాయణ, తిరుపతిస్వామి, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.


పెద్దారవీడు: సాగు చేసిన పంట పొలాల్లో వర్షం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి అన్నారు. మండలం పరిధిలో బద్వీడుచెర్లోపల్లి, ప్రగళ్లపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది, పత్తి పంటలను పరిశీలించిన అనంతరం రైతులతో ఆమె మాట్లాడుతూ వర్షం కురిసినప్పుడు పంట పొలాలకు వెళ్లి నీరు నిల్వ ఉంటే బయటకు పంపించాలన్నారు. ఎప్పటికప్పుడు సాగు చేసిన పంటలను పరిశీలించాలని, తెగుళ్లు, పురుగులు, తదితర వంటివి సోకిన వెంటనే తగిన నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కురిచేడు: వర్షాలు అధికంగా కురుస్తున్నందున పంటలు కాపాడుకునేందుకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు కోరారు. మండలంలోని వెంగాయపాలెం, కురిచేడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో భాగంగా ఆయన పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ కంది, వరి, పత్తి, పొగాకు, మిరప పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యల గురించి వెల్లడించారు. ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏ హారిక, రైతులు పాల్గొన్నారు.


పుల్లలచెరువు: రైతులు సాగు చేసిన కంది పంటలో యాజమన్యా పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద పీఆర్‌సీ తండా, యండ్రపల్లి గ్రామాల్లో పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న కంది పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. కంది పంట పూత దశకు చేరుతున్నందున యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఏవైనా తప్పలు ఉంటే సమీప రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 18వ తేదీ లోపు సరి చేసుకోవాలన్నారు. వీఏఏ రాంబాబు, అనితాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



పెద్దదోర్నాల: వేప గింజల కషాయం తయారీలో రైతులు



పెద్దారవీడు: రైతులతో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి



పుల్లలచెరువు: రైతులకు సూచనలిస్తున్న ఏవో నిర్మలాదేవి

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్

పుల్లలచెరువు: మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సంపత్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఆయన పుల్లలచెరువు లో వాహనాల తనిఖీ చేస్తూ పలువురికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న మైనర్లను, వాహనాలకు సరైన పత్రాలు, లైసెన్స్ లేని వారిని పోలీసుస్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. యువకులు వాహనాలను అతివేగంగా నడిపి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. వేగం కన్నా ప్రాణం మిన్న అనే విషయాన్ని వాహనదారులు గుర్తుంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాన్ని నడిపే వారు హెల్మెట్, ఫోర్‌వీల్స్ నడిపే వారు సీట్ బెల్ట్‌ను తప్పని సరిగా ధరించాలని, ప్రభుత్వం ద్వారా పొందిన ధ్రువపత్రాలు తప్పని సరిగా ఉండాలని సూచించారు. పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించామని ఎస్సై తెలిపారు.

నాగులవరం చెరువు పరిశీలన



మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం పెద్ద నాగులవరం వంతెనను ఇన్‌చార్జి ఎంపీడీఓ భాగ్యవతి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రేవతి, వీఆర్‌ఓ కల్యాణి మంగళవారం పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువు కట్టను పరిశీలించి ఎప్పటికప్పుడు ఇరిగేషన్, పోలీసు అధికారులకు సమాచారం అందిస్తున్నామన్నారు.

చిరుద్యోగుల పొట్టకొట్టడం దారుణం

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘంలో అక్రమంగా తొలగించిన కాంట్రాక్టు ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు కార్మికుల రిలే దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత 25 ఏళ్లుగా మార్కాపురం మున్సిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులను తొలగిస్తూ వారి పొట్టకొట్టే విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. టీడీపీ కూటమి నేతలు తమది ఫ్రెండ్లీ ప్రభుత్వం, చిరుద్యోగులే మా మిత్రులని ప్రచారం చేస్తూ ఆచరణలో మాత్రం ఉద్యోగాల నుంచి ఊడబీకుతున్నారని మండిపడ్డారు. కార్మికుల తొలగింపులో నిబంధనలు తుంగలో తొక్కారని దుయ్యబట్టారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన

తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అధికారుల నుంచి ఎటువంటి ఉత్తర్వులు లేకుండా తమను విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రఫీ, సోమయ్య, కాంట్రాక్టు, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరి, కనకయ్య, హరీష్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.